ప్రజాశక్తి
సోమవారం 15 జులై 2024
5
అనంతపురం

యథేచ్ఛగా నకి'లీలలు'

దేశంలోనే కరువుకు నిలయం ఉమ్మడి అనంతపురం జిల్లా. జిల్లాలో వ్యవసాయాన్నే నమ్ముకున్న రైతు ప్రకృతి కోపానికి బలవడం ఒకెత్తయితే.. రైతే లక్ష్యంగా మోసాలకు పాల్పడే అక్రమార్కుల చర్యలతో రైతులు పీకల్లోతు కష్టనష్టాల్లో కూరుకుపోతున్నారు. వర్షపాతం తక్కువ నమోదు అవుతున్న నేపథ్యంలో పడే కాస్తా వర్షంతోనే మొక్కజొన్న సాగు ఆశలో ఉండే రైతును సీజన్ ప్రారంభంలోనే నకిలీ విత్తనాలను, మరో పక్క సోర్స్ సర్టిఫికెట్ లేకుండానే దుకాణాదారులు అమ్మకాలు చేస్తున్నారు. దీంతో రైతులు అప్పులు చేసి వేసిన పంటలు చేతికందక...చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. ఫర్టిలైజర్ దుకాణ నిర్వహకులు యధేచ్ఛగా నిబంధనలు అతిక్రమిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు పట్టించుకోవటం లేదు.

ప్రజాశక్తి-హిందూపురం

- రైతులను నట్టేట ముంచుతున్న స్వార్థపరులు
- సోర్స్ సర్టిఫికెట్ లేకుండానే విత్తనాల అమ్మకాలు
- పట్టించుకోని వ్యవసాయ శాఖ

ఉమ్మడి అనంతపురం జిల్లాలో రైతులు ప్రధానంగా వర్షాధార పంటలపైనే ఆధారపడ్డారు. ఇందులో ముఖ్యంగా వేరుశనగ, మొక్కజొన్న, మిర్చి ఇతర పంటలతో పాటు బోరు బావుల కింద కొందమంది రైతులు ఉద్యానవన పంటలతో పాటు కూరగాయాల పంటలు పండిస్తూ జీవనం చేస్తున్నారు. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకున్న కొంత మంది ఫర్టిలైజర్ షాపు నిర్వహకులు ఒక పక్క నకిలీ విత్తనాలు, పురుగుల మందులను అధికధరలకు విక్రయిస్తున్నారు. నకిలీ విత్తనాలు, పురుగుల మందులు మార్కెట్‌లో రాజ్యమేలుతున్నా వీటి నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవడంలో అధికారులు పరిమిత చర్యలతోనే సరిపెడుతున్నారనే విమర్శలు వినపడుతున్నాయి. దీంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఇందుకు నిదర్శనం హిందూపురం పట్టణంలోని నందిని సీడ్స్ దుకాణాన్ని విజిలెన్స్ అధికారులు తనఖీ చేసిన సమయంలో దాదాపు అనుమతి లేకుండా విక్రయిస్తున్న రూ.23లక్షలు విలువ చేసే మొక్కజొన్న, వరి విత్తనాలు బయట పడడమే. దీంతో పాటు ఎరువులకు సంబంధించి రూ. 81వేలు విలువ చేసే హ్యూమిక్ యాసిడ్ 250 లీటర్లకు స్టాప్ సేల్స్ నోటీసును అధికారులు నిర్వాహకులకు ఇచ్చారు. ఒక్క దుకాణంలోనే ఇంత పెద్ద ఎత్తున అవినీతి బయట పడింది. ఇదే పట్టణంలో 11 ఫర్టిలైజర్ దుకాణాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో దాదాపు 900 పైగా ఫర్టిలైజర్, విత్తనాల దుకాణాలు ఉన్నాయి. వీటిలో నిబంధనలకు లోబడి ఎన్ని దుకాణాలు నిర్వహిస్తున్నారో తెలియని స్థితి నెలకొంది. జిల్లాలో అడపదడపా విజిలెన్స్ అధికారులు తనఖీలు చేసి కేసులు నమోదు చేస్తున్నారు. అయితే ఎక్కడా కఠినచర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఫర్టిలైజర్ దుకాణంలో ప్రతి రైతుకు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలని, ఎంఆర్‌పికే సేల్స్ చేయాలని లేనిపక్షంలో చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని స్థానికంగా ఉన్న వ్యవసాయ అధికారులు హెచ్చరికలు చేసి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు వినపడుతున్నారు. ఇక పోతే జిల్లాలో సాగు చేసే మరో ప్రధాన పంట మిర్చి. ఇందులో సైతం కల్తీ రాజ్యమేలుతోంది. దీంతో పంట చేతికందే సమయంలో పంటకు పురుగులు పడుతున్నాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు పంపిణీ చేస్తామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కల్పించడం లేదు. చివరికి అక్రమార్కుల ధనార్జనకు రైతులు బలవుతున్నారు.

ముంచుతున్న నకిలీ

జిల్లా మొత్తంగా బయో పురుగుల మందుల వ్యాపారం దాదాపు రూ.70 కోట్ల వరకూ ఉంటుందని అంచనా కాగా ఇందులో 90 శాతం మందులు నకిలీవని విశ్వసనీయ సమాచారం. ఉమ్మడి జిల్లాలో దాదాపు 900 వరకు బయో పురుగు మందుల దుకాణాలున్నాయి. వీటిల్లో సీజన్‌కు రూ.30 కోట్ల వ్యాపారం జరుగుతుందని అంచనా. ఇందులో 90 శాతానికి పైగా నకిలీ మందులే విక్రయిస్తారన్న ఆరోపణలున్నాయి. ఈ ఉత్పత్తులు పేరుతో చలామణీ అయ్యే కంపెనీల్లో వంద వరకుఉంటే అందులో నాలుగైదు కంపెనీలకు మించి అనుమతులు ఉండవు. అయినా అక్రమార్కులు ఆ మందులనే రైతులకు అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నారు. విత్తన దుకాణాలు హిందూపురం పట్టణంలోని 11 వరకు ఉన్నాయి. వీటిల్లో సీజన్‌కు రూ.20 కోట్ల వ్యాపారం జరుగుతుందని అంచనా. ఇందులో 20 శాతం అంటే రూ. 4 కోట్ల వరకూ నకిలీ విత్తన వ్యాపారమే ఉంటుందన్న ఆరోపణలు ఉన్నాయి. బయో కెమికల్ పేరుతో అనుమతి లేని నకిలీ ముందులను వ్యాపారులు చాటుమాటుగా అమ్ముతూ రైతులను నట్టేట ముంచుతున్నారు. ఉమ్మడి జిల్లాను నకిలీ బయో ఉత్పత్తులు ముంచుతున్నాయి. తెలంగాణతో పాటు పక్కన ఉన్నా కర్నాటక రాష్ట్రం నుండి వస్తున్న ఈ ఉత్పత్తులు వివిధ రకాల కంపెనీల పేరుతో జిల్లాలోకి ప్రవేశిస్తున్నాయి. లైసెన్సు లేని వ్యాపారులు రైతులతో సంబంధాలున్న కొందర్ని ఎంపిక చేసుకుని లాభాల ఆశ చూపి వారి ద్వారా ఆయా మందులను రైతులకు అంటగడుతున్నారు. అమ్మకాలను బట్టి కమీషన్లతో పాటు బంగారం, వెండి నాణేలు ఇస్తూ అక్రమ వ్యాపారాన్ని మరింతగా విస్తరిస్తున్నారు. ఈ ఎరువుల ద్వారా తెగుళ్ళ, పురుగు నివారణతో పాటు పంటకు ఇతర పోషకాలు నేరుగా అందుతాయిని, పూత, దిగుబడి అధికంగా వస్తుందని నమ్మబలుకుతున్నారు. చిన్న మందు డబ్బా తయారీకి రూ.20 వరకు అవుతుండగా దాన్ని రూ. 600 వరకు అమ్మి అక్రమంగా అర్జిస్తున్నారు. రైతులను మోసం చేయడానికి ఉత్పత్తిదారులు తొలుత డీలర్లతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. తమ ఉత్పత్తులను ఎక్కువగా అమ్మిన వారికి అధిక కమీషన్లు, బంగారు నాణేలు ఇస్తామని ఆశ చూపుతున్నారు. వీటికి ఆశపడిన డీలర్లు.. తమకు రైతులతో ఉన్న పరిచయాలను ఉపయోగించి వారితో బయో ఉత్పత్తులను కొనిపిస్తున్నారు. అయితే రైతులకిచ్చే బిల్లులను అసలైనవి కాకుండా కొటేషన్ రూపంలో ఇస్తున్నారు. తీరా రైతు మోసపోయినా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉంటున్నాడు. విత్తనాల విషయంలో రైతులను మరో తరహాలో మోసం చేస్తున్నారు. కొన్ని కంపెనీలైతే ఒక సీజన్‌లో అమ్ముడవని విత్తనాలను కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసి వాటిని మరుసటి సీజన్‌లో కొత్త విత్తనాల ప్యాకెట్లతో కలిపి అమ్ముతున్నారు. అయితే వీటిపై పూర్తిస్థాయిలో నిఘా, కఠిన చర్యలు కరువయ్యాయి.

దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్ ఫొటో)

ఆ రాత్రి గడిచి ఉంటే...

ఇంటి పైకప్పుకూలి దంపతుల మృతి

ప్రజాశక్తి - ఉరవకొండ

ఆ ఒక్కరాత్రి గడిచి ఉంటే వారిద్దరూ బతికేవారు. తమ పాత ఇంట్లోపడుకున్న దంపతులకు అదే చివరి రాత్రి అయింది. తాము నివసిస్తున్న ఇల్లు శిథిలావస్థకు చేరుకోవటంతో ఎప్పుడు ఏం జరుగుతుందో అన్న ఆందోళనలో ఉన్న వారు తాము నిర్మించుకుంటున్న కొత్తఇంట్లో తాత్కాలికంగా ఉందామని నిర్ణయించుకున్నారు. మరుసటి రోజు ఆ ఇంట్లోకి సామాన్లు మారుద్దామని అనుకున్నారు. ఆ విషయంపై కుటుంబసభ్యులు శనివారం రాత్రి చర్చించుకున్నారు. అయితే ఆరాత్రి వారు పడుకున్న ఇంటి పైకప్పు కూలిపోయింది. దీంతో ఇంట్లో పడుకున్న ఆ దంపతులిద్దిరి మీద మట్టిపెళ్లలు పడటంతో ఇద్దరూ మృత్యువాత పడ్డారు. ఈ విషాదకర సంఘటన ఉరవకొండ మండలం హావళిగి గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు...

ఉరవకొండ మండలం హావళిగి గ్రామానికి చెందిన మారెప్ప, లక్ష్మి అనే దంపతులకు ఒక కూతురు, ఇద్దరు కుమారులు. మారెప్ప స్థానికంగా ఉన్న ఓ రైస్‌మిల్‌లో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గ్రామంలో వారు నివాసమున్న ఇల్లు పాతది కావటంతో గ్రామంలోనే కొత్తగృహం నిర్మించుకుంటున్నారు. ఆ గృహానికి స్లాబ్ కూడా వేయించారు. శనివారం చిన్నపాటి వర్షం కురిసింది. తాము ఉంటున్న గృహం శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని అనుమానపడ్డారు. తెల్లవారితే కొత్తగా నిర్మించుకుంటున్న ఇంట్లోకి తాత్కాలికంగా చేరుదామని అనుకున్నారు. ఇదే విషయంపై ఇంట్లో చర్చించుకున్నారు. శనివారం రాత్రి మారెప్ప (49), లక్ష్మి (45) ఇంట్లో పడుకున్నారు. కూతురు మానస, బావమరది రాము కూడా ఇంట్లోనే పడుకున్నారు. మారెప్ప కుమారులు అంజి, హేమంత్ ఇంటిబయట పడుకున్నారు. అయితే అకస్మాత్తుగా ఇంటి పైకప్పు కూలిపోయింది. మారెప్ప, లక్ష్మిమీద పూర్తిగా మట్టిపెళ్లలు పడటంతో వారు అక్కడికక్కడే మృతిచెందారు. మానస, రాముకు తీవ్ర గాయాలు అయ్యాయి. వారితో పాటు బయట పడుకున్న అంజి, హేమంత్ ప్రాణాలతో బయట పడ్డారు. ఈ ఘటనలో తీవ్ర గాయాల పాలైన మానస, రామును చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆ ఒక్క రాత్రి గడిచి ఉంటే ఆ దంపతులు ఇద్దరూ బతికేవారని, ఇంతలోనే వారికి జరగరానిది జరిగిందని మృతుల బంధువులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దంపతులు ఇద్దరూ మృతిచెందడంతో మాటలు రాని యుక్తవయస్సులో ఉన్న మానస, అంజి, హేమంత్ అనాధలు అయ్యారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మృతుల కుటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వాలి

శనివారం రాత్రి మిద్దె పైకప్పు కూలి మృతి చెందిన దంపతుల కుటుంబ సభ్యులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా నాయకులు రంగారెడ్డి డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 10లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి కుటుంబసభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తల్లిదండ్రులను పోగొట్టుకున్న ముగ్గురు పిల్లలు భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ప్రభుత్వం ఖచ్చితంగా ఆ కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ఉందని అన్నారు.

స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు, కారును చూపుతున్న అధికారులు

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

వాహనం సీజ్

ప్రజాశక్తి - కదిరి టౌన్

అక్రమంగా తరలిస్తున్న 13 ఎర్ర చందనం దుంగలను, వాహనాన్ని అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. కదిరి రేంజ్ అటవీశాఖ అధికారి గుర్రప్ప ఆధ్వర్యంలో నల్లచెరువు మండలం పెద్ద ఎల్లం పల్లివద్ద కదిరి మదనపల్లి రహదారి పై వాహనాల తనిఖీ చేస్తుండగా మదనపల్లి నుండి కదిరి వైపు వస్తున్న వాహనంలో అక్రమంగా ఎర్రచందనం దుంగలను తరలిస్తున్నట్లు గమనించారు. దీంతో అటవీశాఖ సిబ్బంది వాహనాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయగా వాహనాన్ని దూరంగా ఆపివేసి ఇద్దరు దుండుగులు పరారయ్యారు. దీంతో వాహనంలో ఉన్న 13 ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ. 2 లక్షలపై చిలుకు ఉంటుందని కదిరి రేంజ్ అటవీశాఖ అధికారి గురప్ప తెలిపారు. వాహనం నెంబర్ ఆధారంగా నిందితులను పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి రామచంద్ర నాయక్, సెక్షన్ అధికారి రామచంద్రారెడ్డి, ఎఫ్‌బిఒలు నాగరాజు, హరిప్రసాద్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల విధుల్లో ఉన్న పోలీసులు

గూగూడులో భక్తులకు తిప్పలు..!

కరువైన కనీస సౌకర్యాలు

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని గూగూడులో వెలసిన కుళ్లాయిస్వామి ఉత్సవాల్లో సౌకర్యాలు లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భక్తులతోపాటు బందోబస్తుకు వచ్చి పోలీసులు సైతం నానా తిప్పలు పడుతున్నారు. ఉత్సవాల్లో చిన్న సరిగెత్తు, పెద్ద సరిగెత్తు ప్రధాన ఘట్టాలు. ఇందులో భాగంగానే ఆదివారం కుళ్లాయిస్వామి చిన్న సరిగెత్తు నిర్వహించారు. దీంతో భక్తులు భారీగా తరలిరావడంతో క్యూలైన్‌లో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చాలామంది ఊరి బయటే ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. మరికొందరు స్వామిని దర్శించుకోకనే వెనుదిరిగి వెళ్లారు. ఇకపోతే ఉత్సవాల్లో బందోబస్తు నిర్వహించేందుకు జిల్లావ్యాప్తంగా వచ్చిన పోలీసులు సైతం నానాతిప్పలు పడ్డారు. విధుల కోసం వచ్చిన పోలీసులకు ఆలయ సిబ్బంది, దేవాదాయ శాఖ అధికారులు కనీస అవసరాలైనా నీరు, నాణ్యమైన భోజనం కూడా పూర్తిస్థాయిలో అందించలేదని వాపోతున్నారు. అగ్నిగుండం ముందు తీవ్రమైన సెగలో విధులు నిర్వహిస్తున్నా కనీసం మజ్జిగ ఇచ్చే వారు కూడా ఇవ్వకపోవడం బాధాకరం. చిన్న సరిగెత్తులోనే ఇలాంటి పరిస్థితి ఉంటే ఉత్సవాల్లోనే ప్రధాన ఘట్టమైన పెద్ద సరిగెత్తు రోజు పరిస్థితి ఎలా ఉంటుందో అని భక్తులు, పోలీసు సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై ఆలయ కార్య నిర్వహణ అధికారి సాకేతపురం శోభను ప్రజాశక్తి వివరణ కోరగా విధి నిర్వహణలో గూగూడుకు వచ్చిన పోలీసులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అయితే వివిధ శాఖల అధికారులు, పోలీసుల సమన్వయంతో ముందుకు సాగుతున్నామన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కుళ్లాయిస్వామి దర్శనానికి వచ్చే భక్తులోపాటు విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు కనీస మౌలిక వసతులు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

పాత్రికేయుడిపై దురుసు ప్రవర్తన

ఆలయంలో గ్రామానికి చెందిన కొందరు యువకులు చేష్టలు మితిమీరుతున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులతోపాటు విధి నిర్వహణలో ఉన్న పాత్రికేయులపై దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ఆలయంలోనే చెప్పలేని బూతులు తిడుతున్నారు. ఓ పాత్రికేయుడు విధి నిర్వహణలో ఫొటోలు తీసుకోవడానికి ప్రయత్నిస్తుండగా దాడికి యత్నించడం బాధాకరం. వీరిలో ఓ ఆకతాయి పాత్రికేయుడి సెల్‌ఫోన్ లాక్కొన్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేస్తానని చెప్పినా 'దిక్కున చోట చెప్పుకో' అంటూ బూతులు తిట్టడం బాధాకరం. ఇలాంటి అల్లరిమూకల కారణంగా ఆలయానికి చెడ్డపేరు వస్తోందని పలువురు అంటున్నారు. ఈ విషయంపై ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డికి పాత్రికేయులు ఫిర్యాదు చేశారు. ఇందుకు ఎస్ఐ స్పందిస్తూ పాత్రికేయుడిపై దురుసుగా ప్రవర్తించిన ఆకతాయిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పాతపెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

యుటిఎఫ్ ఆధ్వర్యంలో జిపిఎస్ గెజిట్ ప్రతులు దహనం

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

ఈనెల 12న విడుదల చేసిన జిపిఎస్ గెజిట్ నోట్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని టవర్ క్లాక్ వద్ద జిపిఎస్ గెజిట్ ప్రతులను ఆదివారం దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి కోటేశ్వరప్ప మాట్లాడుతూ సిపిఎస్ స్థానంలో గత ప్రభుత్వం జిపిఎస్‌ను అమలు చేస్తూ జీవో నెంబర్ 54 ను తీసుకురావడం జరిగిందన్నారు. ఈ జీవోకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి అమలు కాకుండా చేశామని అన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం జిపిఎస్ గెజిట్ ను ఈ నెల 12 తేదీన విడుదల చేసిందన్నారు. లక్షలాదిమంది ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేసే జీవో నెంబర్ 54 ను, జిపిఎస్ గెజిట్ ను వెంటనే రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వి. గోవిందరాజులు మాట్లాడుతూ టిడిపి కూటమి ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలలో భాగంగా విడుదల చేసిన గెజిట్ ను రద్దు చేస్తూ, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. అదేవిధంగా తల్లికి వందనం కార్యక్రమం కేవలం ప్రభుత్వ బడులలో చదివే విద్యార్థులకు మాత్రమే అమలు చేస్తూ, స్పష్టమైన విధి విధానాలను ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు నాగేంద్ర, లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కూటమి నాయకులు తమ ఎన్నికల ప్రచారంలో జగన్ ప్రభుత్వం తీసుకువచ్చిన జిపిఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని హామీలు ఇచ్చారన్నారు. కానీ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే ఉద్యోగుల ఉపాధ్యాయులను మోసం చేస్తూ జిపిఎస్ గెజిట్ ను విడుదల చేసి మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ గౌరవాధ్యక్షులు ఎస్‌విపి. రమణయ్య, జిల్లా కార్యదర్శి సంజీవ్ కుమార్, సీనియర్ నాయకుడు కె.నాగేంద్ర, వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు చిత్తప్ప, గంగాధర్,వెంకట్ నాయుడు, రాజ కుల్లాయప్ప,సీతారాం రెడ్డి,రాజేంద్ర, హెన్రీ మార్క్, ఉమాపతి, వెంకటరాముడు, మహబూబ్ బాషా, నాగభూషణ, జిలాన్, జాకీర్ హుస్సేన్, పవన్ కుమార్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ మంజువాణి

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గట్టి చర్యలు చేపడుతున్నట్లు శ్రీ సత్య సాయి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మంజువాణి పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వెలిబుచ్చారు. జిల్లావ్యాప్తంగా అతిసారా, టైఫాయిడ్, మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలకుండా గట్టి చర్యలు చేపట్టామన్నారు. జిల్లా వ్యాప్తంగా వ్యాధులు అదుపులో ఉన్నాయని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది, మండల అభివృద్ధి అధికారులు తగిన జాగ్రత్తలు పాటించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు.

ప్రశ్న : జిల్లాలో ఎన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రిలో ఉన్నాయి?

జవాబు: శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా 41 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, నాలుగు ఏరియా ఆసుపత్రులు, 18 అర్బన్ హెల్త్ సబ్ సెంటర్లు ఉన్నాయి. వీటి ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు వైద్య సేవలు అందించడమే కాక గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో వైద్య సిబ్బందిచే అవగాహన కార్యక్రమాలు, సర్వేలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

ప్ర : జిల్లావ్యాప్తంగా ఆసుపత్రులలో మందుల కొరత, సిబ్బంది కొరత ఉందా ?

జ : శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా మందులు కొరత ప్రస్తుతం లేదు. గతంలో కొరత రావడంతో పక్కన ఉన్న జిల్లాల నుండి కొన్ని మందులను తెప్పించుకొని అన్ని కేంద్రాలకు అందజేశాం. ఇక సిబ్బంది కొరత ఎక్కడా లేదు. ఉన్న సిబ్బందితోనే అన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. సిబ్బంది కొరత ఏర్పడిన చోట ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారి ద్వారా ఖాళీలను పూరించే విధంగా చర్యలు చేపడతాం.

ప్ర : జిల్లాలో డయేరియా వ్యాప్తిపై ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.

జ : జిల్లాలో ప్రస్తుతం డయేరియా కేసులు లేవు. డయేరియా ప్రబలకుండా తగిన చర్యలు తీసుకున్నాం. గత నెలలో 14వ తేదీ నుండి 30 వరకు గ్రామీణ పట్టణ ప్రాంతాలలో ఐదు సంవత్సరాల లోపు పిల్లలను గుర్తించాం. అనంతరం జులై 1వ తేదీ నుండి 30 వరకు ప్రతి ఇంటికి వెళ్లి రెండు ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందజేసి ఆ వ్యాధి ఎలా సక్రమిస్తుంది దానిపై వారికి అవగాహన కల్పించి ఆ వ్యాధి లక్షణాలు, ఎలా ఉంటాయి, నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి జిల్లా అంతటా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. అంతే కాక జిల్లాలో గతంలో మలేరియా కేసులు ఉత్పన్నమైన 9 గ్రామాలను గుర్తించి ఆయా గ్రామాలలో ఐఆర్ఎస్ స్ప్రే పిచికారి చేసి దోమల వ్యాప్తిని అరికట్టే విధంగా చర్యలు తీసుకున్నాం.

ప్ర : శ్రీరిచ్చే వైద్య సలహాలు, సూచనలు

జ: ఆగస్టు ,సెప్టెంబర్, అక్టోబర్ మూడు మాసాల పాటు గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. ఈ సమయాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. కుటుంబంలో వ్యక్తిగత శుభ్రతను పాటించాలి. భోజనం ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. గ్రామాల్లో, నివాసాలు ముందు నీటి గుంతలు, నీటి నిల్వలు లేకుండా చేసుకోవాలి. దోమలు కుట్టకుండా అవి ఉత్పన్నం కాకుండా తగిన చర్యలు చేపట్టాలి. దోమలనుండి రక్షణ కోసం దోమతెరలు, వేపాకు పొగ, ఇంటి కిటికీలకు మెస్సు వాడాలి. ఎక్కువ శాతం బయట ఆహార పదార్థాలు తినకుండా కుటుంబంలోనే తయారు చేసుకుని తినాలి. బయట లభించే జంక్ ఫుడ్ తీసుకోరాదు. ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. వాంతులు విరేచనాలు సంభవిస్తే నాటు వైద్యం చేయించుకోకుండా తక్షణం ప్రభుత్వ ,ప్రైవేటు ఆసుపత్రులలో డాక్టరును సంప్రదించి సలహాలు సూచనలు పాటించాలి.

డిఎం హెచ్ఒ మంజువాణి

టిడిపి పాలనలో ఉద్యోగులపై వేధింపులు ఉండవు

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

టిడిపి ప్రభుత్వ పాలనలో ఉద్యోగులపై ఎలాంటి వేధింపులు ఉండవని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. రాయదుర్గం తాలూకా ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, పెన్షనర్ ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో ఎన్జీవోల సంఘం జిల్లా నాయకులు కెంచే లక్ష్మీనారాయణ అధ్యక్షతన ఆదివారం రాయదుర్గంలోని కురిహిన శెట్టి కళ్యాణ మండపంలో ఆత్మీయ సత్కార సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యోగులు దీర్ఘకాలంగా కోరుతున్న సిపిఎస్ రద్దు, ఓపిఎస్ పునరుద్ధరణ అంశం రాష్ట్ర ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. అలాగే 2003 డిఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు ఓపిఎస్ పునరుద్ధరణ గురించి మంత్రి నారా లోకేష్‌తో మాట్లాడుతానన్నారు. రాయదుర్గంలో ఉపాధ్యాయ భవన్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఐదేళ్లుగా రాయదుర్గంలో ఎలాంటి అభివృద్ధి లేదన్నారు. ప్రజలకు మంచి చేసిన ఆనవాళ్లు కనిపించలేదన్నారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పట్టణంలో మూడు ఫ్లైఓవర్లు మంజూరు చేయించగా వైసిపి ప్రభుత్వం వాటిని పూర్తి చేయలేక పోయిందన్నారు. అలాగే బళ్లారి రోడ్డు విస్తరణ, ఊడేగోళం జాతీయ రహదారి నుంచి బళ్లారి రోడ్డు మల్లాపురం గేట్ వరకూ ఆఫ్ రింగ్ బైపాస్ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ఆర్థిక స్థితి గురించి ఇటీవలే ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవతో మాట్లాడానని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి రూ.12 నుంచి రూ.14 లక్షల కోట్ల అప్పులు ఉన్నాయన్నారు. ప్రభుత్వం నడవాలంటే కనీసం రూ.4 నుంచి రూ.5వేల కోట్ల అవసరం అవుతుందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. ఓవైపు అభివృద్ధి చేయడంతోపాటు మరోవైపు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పేరిట ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చాక అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వం సజావుగా నడవాలంటే ఉద్యోగుల సహకారం, భాగస్వామ్యం అవసరమన్నారు. ప్రస్తుతం రాయదుర్గం అభివృద్ధి, ప్రజలు బాగు కోసం కృషి చేస్తానన్నారు. బీటీ ప్రాజెక్టుకు కృష్ణాజలాలు తీసుకొచ్చి నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరు అందించే బాధ్యత విషయంలో పురోగతి చూపుతానన్నారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం అధ్యక్షులు రామాంజనేయులు, యుటిఎఫ్ నాయకులు వెంకట్రామిరెడ్డి, హనుమంతురెడ్డి, ఏపీటీఎఫ్ నాయకులు రామాంజనేయులు, మోహన్ రెడ్డి, ఎస్టీయూ నాయకులు రంగనాథ్, ఎన్జీవో సంఘం నాయకులు పరమేశ్వరప్ప, వీరేష్, పిఇటిల సంఘం నాయకులు అక్కులప్ప, అంగన్వాడి సంఘం నాయకులు మేరీ, ఆర్టీసీ ఎన్ఎంయు నాయకుడు తిప్పేస్వామి, పలు ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు, పెన్షనర్లు, కార్మికులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాయదుర్గం అభివృద్ధికి వినతి

రాయదుర్గం అభివృద్ధికి కృషి చేయాలని రాయదుర్గం హెరిటేజ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్. హులికుంటి మూర్తి, సంయుక్త కార్యదర్శి గుడేకోట శివకుమార్ కోరారు. ఈమేరకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ఉన్న కోట ముఖ ద్వారం జీర్ణోద్ధరణ పనులు చేపట్టాలని, రాయదుర్గం రైల్వే స్టేషన్ కొత్త భవనం ప్రారంభించాలని, ఎక్స్‌ప్రెస్ రైళ్లను రాయదుర్గంలో ఆపాలని, కదిరిదేవరపల్లి- తిరుపతి రైలును తిరిగి పునరుద్ధరించాలని, తుమకూరు- రాయదుర్గం రైలు మార్గం నిర్మాణం పనులు వేగవంతం చేయాలని కోరారు. "ఆజాది కా అమృత్ సరోవర్" పథకం కింద రాయదుర్గం పట్టణ పరిసరాల్లో ఉన్న నాయుని చెరువు, విట్లం చెరువు, సీతమ్మ కుంట, వట్లకుంట, ఉపచర్ల కుంట, తేరు బావి మొదలైన చెరువులు, బావులు కుంటల జీర్ణోదరణ పనులు చేపట్టాలన్నారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

ఘనంగా చిన్న సరిగెత్తు

గూగూడుకు భారీగా తరలివచ్చిన భక్తులు

మండుతున్న కుళ్లాయిస్వామి అగ్నిగుండం

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని గూగూడు గ్రామంలో వెలసిన కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం చిన్న సరిగెత్తు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుళ్లాయిస్వామి దర్శనానికి భారీ ఎత్తున భక్తులు తరలివచ్చారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ సంస్థ వివిధ ప్రాంతాల నుంచి గూగూడుకు బస్సులు నడుపుతోంది. ఒకవైపు స్పెషల్ బస్సులు.. మరోవైపు ప్రయివేటు వాహనాలు, ద్విచక్ర వాహనాలు అధికంగా రావడంతో ఆదివారం ఉదయం నుండే ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించిపోయింది. అధికారులు ఎన్ని ఏర్పాట్లు చేసినా అంచనాలకు మించి భక్తులు తరలిరావడంతో గ్రామానికి కిలోమీటర్ దూరంలోనే వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. ఫలితంగా భక్తులు ముందుకు వెళ్లలేక, వెనక్కి రాలేని పరిస్థితి ఏర్పడింది. చాలామంది భక్తులు స్వామి దర్శనం చేసుకోకుండానే వెనుతిరిగి వెళ్లిపోయారు. అగ్నిగుండంలో భక్తులు భారీ ఎత్తున పెద్ద పెద్ద మొద్దులు, కట్టెలు వేస్తుండడంతో అగ్నిగుండం సెగ భారీ ఎత్తున పెరిగిపోయింది. దీంతో భక్తులు అగ్నిగుండం సెగ భరించలేకపోయారు. చిన్న సరిగెత్తు సందర్భంగా కుళ్లాయిస్వామి దర్శనం కోసం పలువురు భక్తులు పొంగలి, బెల్లం పానకాలు పట్టుకుని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయం చుట్టూ భక్తులు పొర్లుదండాలు చేశారు. కాగా మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు కుటుంబ సమేతంగా కుళ్లాయిస్వామిని దర్శించుకున్నారు.

భక్తుల అన్నదానం

చిన్న సరిహద్దు కావడంతో కుల్లాయిస్వామి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం పలువురు గూగూడులో అన్నదానం చేశారు. ఇందులో భాగంగా నార్పలకు చెందిన గూడపురెడ్డి తిరుపాల్‌రెడ్డి కుమారులు, అదేవిధంగా నార్పలకు చెందిన మొరుసు అమర్నాథ్‌రెడ్డి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

గూగూడు లో ఎక్కడికక్కడ స్తంభించిన వాహనాలు

సమస్యల పరిష్కారానికి ఏకం కావాలి

చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర నాయకులు సి.లింగమయ్య

మాట్లాడుతున్న చేతి వృత్తిదారుల రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షులు సి.లింగమయ్య

ప్రజాశక్తి-శింగనమల

మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్యం కావాలని చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శివర్గ అధ్యక్షులు సి.లింగమయ్య పిలుపునిచ్చారు. ఆదివారం నియోజకవర్గంలోని శింగనమల, బుక్కరాయసముద్రం మండల కేంద్రాల్లో మత్స్యకారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఆర్థిక విధానాల కారణంగా మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. మత్స్య వృత్తిలోకి కార్పొరేట్ శక్తులను అనుమతించడం వల్ల ఇబ్బందులు పడుతున్నామన్నారు. రాయలసీమ ప్రాంతాన్ని ఆలోచిస్తే అతివృష్టి, అనావృష్టి కారణంగా చెరువులు సమూలంగా ఎండిపోతున్నాయన్నారు. తద్వారా మత్స్య వృత్తి కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. వంద మత్స్యకార సొసైటీలు న్నా ఒక్క రూపాయి మంజూరు చేసిన పాపానపోలేదన్నారు. తద్వారా మత్స్యకారులు వలసలు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో బీసీ సంఘాలకు సంబంధించి 56 కార్పొరేషన్లుగా విభజించారు తప్ప నిధులు విడుదల చేయలేదన్నారు. ఇప్పటికైనా ఎన్‌డిఎ ప్రభుత్వం స్పందించి మత్స్యకారులకు సబ్సిపై బోట్లు ఇవ్వాలని, చేపల మేతకు సబ్సిడీ, మత్స్యకారులకు ప్రతికూల పరిస్థితుల్లో చనిపోతే ఎక్స్‌గ్రేషియా రూ.20లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి రానున్న రోజుల్లో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగంంజనేయులు, అధ్యక్షులు వెంకటనారాయణ, సెక్రటరీలు పాపారాయుడు, బాలరాజు, చిన్న, అక్బర్, బుక్కరాయసముద్రం మత్స్యకారుల సంఘం అధ్యక్షులు నాగేష్, వెంకట, చేతి వృత్తిదారుల సమాఖ్య జిల్లా కార్యదర్శి సివి.హరికృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు సి.నాగప్ప, నగర అధ్యక్షులు, కార్యదర్శి భూషణ, వీరాంజి, నాయకులు గోవిందరాజులు, భాస్కర్, రైతు సంఘం నాయకులు భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించాలి

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ

పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-అనంతపుకం కలెక్టరేట్

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని తిరిగి ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఓతూరు పరమేష్, శివ, జిల్లా ఉపాధ్యక్షులు వైటీసీ రమేష్, రజిత డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని గణేనాయక్ భవనంలో ఎస్ఎఫ్ఐ ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆగస్టు 6, 7వతేదీల్లో ఉరవకొండలో నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ 32వ జిల్లా ప్లీనరీ సమావేశాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరువుకు నిలయమైన అనంతపురం జిల్లాలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం నిర్వహించేందుకు ఉరవకొండలో ప్లీనరీ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ హాస్టల్లో ఏడునెలలుగా మెస్, కాస్మొటిక్ ఛార్జీలు చెల్లించడం లేదన్నారు. అంతేగాకుండా సంక్షేమ హాస్టళ్లలో భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. మరికొన్ని అద్దె భవనాల్లో నడపాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కావున సంక్షేమ హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలన్నారు. అదేవిధంగా గత ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనం రద్దు చేసిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పున్న ప్రారంభించాలన్నారు. అలాగే జూనియర్ కళాశాల విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు ఇవ్వాలన్నారు. డిగ్రీ అడ్మిషన్లలో ఆన్‌లైన్ విధానాన్ని రద్దు చేసి ఆఫ్‌లైన్ పద్ధతిలోనే నిర్వహించాలన్నారు. వీటితోపాటు అనేక సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వంశీ, సిద్ధు, గిరి, సహాయ కార్యదర్శులు సూర్య, వెంకీ, శివ, భీమేష్ పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యమే ప్రజారోగ్య వేదిక లక్ష్యం

జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసరావు

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-అనంతపురం

ప్రజా ఆరోగ్య వేదిక ఆధ్వర్యంలో కేర్ అండ్ క్యూర్ ఆసుపత్రి సహకారంతో డాక్టర్ అభిషేక్ పర్యవేక్షణలో రెండు రోజులుగా ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గుండెకు సంబంధించిన పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ప్రజారోగ్య వేదిక జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఒత్తిడితో కూడుకున్న జీవనం వల్ల చాలామంది గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారన్నారు. కావున ప్రతి ఒక్కరికీ ఉచిత అవగాహన కల్పించి గుండె పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్యం, జీవన విధానాలపై ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను ఆరోగ్యంగా ఉంచడమే ప్రజా ఆరోగ్య వేదిక మొదటి లక్ష్యం అన్నారు . ఈకార్యక్రమంలో ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర నాయకులు ఎజి.రాజా మోహన్, ఎపిఎంఎస్‌ఆర్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి మనోహర్, జిల్లా నాయకులు నాగరంగయ్య , డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బాలకృష్ణ, సిఐటియు జిల్లా నాయకులు ఆర్‌వి.నాయుడు, జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు రామకృష్ణ, మురళి, ప్రజాశక్తి రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు ఎనలేనివి

ఆరోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్

నూతన అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న అతిథులు

ప్రజాశక్తి-గుత్తి

ప్రపంచ వ్యాప్తంగా లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు ఎనలేనివని రాష్ట్ర ఆరోగ్యశాఖ అదనపు సంచాలకులు డాక్టర్ అనిల్‌కుమార్ కొనియాడారు. ఆదివారం పట్టణంలోని విరుపాక్షరెడ్డి కన్వర్షన్ హాల్‌లో గుత్తి, పామిడి మండలాల నూతన అధ్యక్ష, కార్యదర్శులు కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సేవలను విస్తృతపరచడం అభినందనీయమన్నారు. లయన్స్ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలకు సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. గుత్తిలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు పరిశీలిస్తామన్నారు. అనంతరం లయన్స్ క్లబ్ గుత్తి మండల అధ్యక్ష, కార్యదర్శులు టి.శ్రీనివాసులు, ఎస్.రాఘవేంద్రస్వామి, ఉపాధ్యక్షులు తిరుపతయ్య, కోశాధికారి ఎం.శివ శంకర్, కార్యవర్గ సభ్యులు, పామిడి అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. తర్వాత నూతన కార్యవర్గాలను పలువురు సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ గౌరవ అతిథులు విరుపాక్షిరెడ్డి, డాక్టర్ రుకియా బేగం, ప్రతినిధులు డాక్టర్ తిరుపతి నాయుడు, జిలాన్, మగ్బుల్ హుస్సేన్, డాక్టర్ ఎం.సురేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పారా అథ్లెటిక్స్‌కు జిల్లా క్రీడాకారులు

అనంతపురం కలెక్టరేట్ : ఈనెల 16, 17వ తేదీల్లో బెంగళూరులోని కంఠీరవ స్టేడియంలో నిర్వహిస్తున్న 13వ జూనియర్స్, సబ్ జూనియర్స్ పారా అథ్లెటిక్స్ జాతీయస్థాయి పోటీలకు జిల్లాకు చెందిన 10మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. జూన్ 30న విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్స్, సబ్ జూనియర్స్ పారా అథ్లెటిక్స్ జిల్లా నుంచి 26 మంది క్రీడాకారులు పాల్గొనగా ప్రతిభ కనబరిచిన 10 మంది క్రీడాకారులను జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక చేసినట్లు పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శి నాగరాజు, శ్రీనివాసులు తెలిపారు.

సిఎం చంద్రబాబును కలిసిన 'దేగల'

చంద్రబాబుకు బొకే అందజేస్తున్న దేగల కృష్ణమూర్తి

శింగనమల : ముఖ్యమంత్రి చంద్రబాబును మంగళగిరిలోని టిడిపి కార్యాలయంలో అధికార ప్రతినిధి, రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శి దేగల కృష్ణమూర్తి ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా బొకే అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పంచాయతీలకు రూ.250 కోట్లు విడుదల చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

సిపిఎస్ రద్దు చేయాలి : ఆర్‌పిఎస్

అనంతపురం : రాష్ట్రంలో అత్యధిక మెజారిటీతో అధికారములోకి వచ్చిన ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం వెంటనే రాష్ట్రంలో సిపిఎస్‌ను రద్దు చేసి ఉద్యోగులకు న్యాయం చేయాలని రాజ్యాంగ పరిరక్షణ సమితి (ఆర్‌పిఎస్) వ్యవస్థాపకులు పోతుల నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సిఎం చంద్రబాబు ఎన్నికల ముందు సిపిఎస్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ హామీ మేరకు కేంద్ర ప్రభుత్వంతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

రేపు మండలమీట్

పుట్లూరు : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో రేపు సర్వసభ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ దస్తగిరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హాజరవుతున్నందున మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

ఉచిత వైద్యశిబిరం

నార్పల : మండల పరిధిలోని దుర్గం గ్రామం ఎంపియుపి పాఠశాల ఆవరణలో అనంతపురం హర్షిత ఆసుపత్రి వారు సర్పంచి సాకే రామాంజనేయులు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ కసందర్భంగా జలుబు, దగ్గు, జ్వరం, గ్యాస్ ట్రబుల్, మొలలు, శ్వాసకోశ వ్యాధులకు వైద్యులు రాము, రామచంద్రయ్య చికిత్స చేశారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి మేనేజర్ హరి, గ్రామస్తులు పక్కీరప్ప, గోగుల నారాయణస్వామి, పెద్ద రంగారెడ్డి, పెద్దక్క, రంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మూలవాసి చక్రవర్తుల చరిత్రను వక్రీకరించారు..


మాట్లాడతున్న ఓబిలేసు

అనంతపురం : అనంతపురం మూలవాసి చక్రవర్తుల చరిత్రను వక్రీకరించి... రాక్షసులు, ప్రతినాయకునిగా సృష్టించారని మాదిగ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు పసలూరి ఓబిలేసు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం నగరంలోని ఎంహెపిఎస్ కార్యాలయంలో మాదిగ మూలపురుషుడు, జంబూద్వీప చక్రవర్తి జాంబవంత మహరాజ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమర్థవంత పాలన అందించిన మూలవాసి చక్రవర్తి జాంబవంతుడు, మహిషాసురుడు, బలి చక్రవర్తిని రాక్షసులుగా, ప్రతినాయకులుగా సృష్టించి చరిత్రను వక్రీకరించారన్నారు. మూలవాసుల మూలపురుషలకు జంతువుల రూపాలను ఆపాదించారని ఆవేదన చెందారు. మనిషి జంతువు నుంచి రూపాంతరం చెందాడని డార్విన్ వంటి మహనీయుడు ప్రతిపాదించిన మానవ పరిణామక్ర సిద్ధాంతన్ని గుర్తించాలన్నారు. మూలవాసుల చారిత్రక నేపథ్యాన్ని వక్రీకరించి వివక్షకు గురి చేశారని వాపోయారు. మహనీయుల చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ పిఎస్ నాయకులు న్యాయవాది లబ్బే ముత్యాలప్ప, పప్పూరి మనోహర్, దావీద్, సంత్ రవిదాస్ మెమోరిల్ ట్రస్టు ఛైర్మన్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ జనార్ధన్‌నాయుడు

ప్రశాంతంగా పండుగను జరుపుకోవాలి : డీఎస్పీ

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

మండలం పరిధిలోని వివిధ గ్రామాల్లో మొహర్రం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ జనార్దన్‌నాయుడు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో వివిధ గ్రామాల ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రశాంతంగా పీర్ల పండుగను నిర్వహించుకోవాలన్నారు. ఎవరైనా అసంఘటిత కార్యక్రమాలకు పాల్పడినా, ఫ్యాక్షన్ ప్రేరేపిత కార్యక్రమాలకు దిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మీరే బాధ్యత కమిటీలు వేసుకుని గ్రామపెద్దల ఆధ్వర్యంలో ఉత్సవాన్ని జరుపుకోవాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే స్థానిక ఎస్ఐ గౌస్‌బాషా దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మహదేవ్ అశోక్‌కుమార్, పోలీస్‌సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కుక్కలకు టీకా

రాయదుర్గం రూరల్ : రేబిస్ రహిత సమాజ నిర్మాణంలో భాగంగా ఆదివారం 48 కుక్కలకు రేబిస్ టీకాలు వేసినట్లు రాయదుర్గం పశువైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం మున్సిపల్, పశుసంవర్ధక శాఖలు సంయుక్తంగా సామూహిక ఉచిత రేబిస్ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా 48 కుక్కలు, 8 పిల్లులకి టీకాలు వేసినట్లు తెలిపారు. రేబిస్ వ్యాధి సమూలంగా నిర్మూలించేలా ప్రతి ఒక్కరు చొరవ చూపాలన్నారు.

టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి

'అనంత'కు చేరిన బస్సుయాత్ర

అనంతపురం : ఐసిఎఐ ప్రధాన కార్యాలయం ప్రారంభించి 100 రోజులు, 100 పట్టణాలు, 100 ప్రోగ్రామ్స్‌తో చేపట్టిన ఎంఎస్‌ఎంఈ, స్టార్టప్ బస్సుయాత్ర ఆదివారం జిల్లాకేంద్రానికి చేరుకుంది. ముందుగా రాప్తాడులోని ఎంఎస్‌ఎంఈ పార్కులో జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియాదేవి, ఏపీఐఐసి జోనల్ మేనేజర్ సువన సోనీ, రాప్తాడు ఎంఎస్‌ఎంఇ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రాఘవేంద్ర సమక్షంలో 1,200 చెట్లను నాటారు. తర్వాత జెఎన్‌టియు రోడ్డులోని ఐసిఎఐ అనంతపురం జిల్లా శాఖా కార్యాలయంలో పరిశ్రమలు స్థాపించడానికి అవకాశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇండస్ట్రియల్ ఆఫీసర్ నాగరాజారావు, అటల్ ఇంక్యూబేషన్ సెంటర్ మేనేజర్ చంద్ర మౌళి, రూడ్ సెట్ డైరెక్టర్ విజయలక్ష్మి, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ అధికారి రుద్రయ్య, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు శేషాంజినేయులు, ఛార్టర్డ్ అకౌంటెంట్ వెంకటేష్ దబ్బర, ఐసిఏఐ అనంతపురం జిల్లా ఛైర్మన్ సిఏ ప్రదీప్ కుమార్, వైస్ ఛైర్మన్ సిఏ మొహమ్మద్ అబ్దుల్ రాఖీబ్, సెక్రటరీ సిఏ ఫణికుమార్, కోశాధికారి సిఏ అరవింద్‌రామ, జిల్లా ఎంఎస్‌ఎంఈ కమిటీ మెంబర్ సిఏ రవి శంకర్ మరియు జిల్లాలోని ప్రముఖ ఛార్టర్డ్ అకౌంటెంట్స్ పాల్గొన్నారు.

శాకంబరి అలంకరణలో వాసవీమాత

బెలుగుప్ప : ఆషాడమాసాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని నగరేశ్వరస్వామి ఆలయంలో వెలిసిన వాసవీమాత ఆదివారం శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. ఇందులో భాగంగా ఆర్యవైశ్యుల మహిళా మండలి ఆధ్వర్యంలో శాకంబరి అలంకారంలో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. తర్వాత వాసవీమాత పారాయణం, లలితాంబ పారాయణం చదివి వినిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్యులు, మహిళలు, ఆర్యవైశ్యుల మహిళా మండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్లు వేయించాలని వినతి

సమస్యను చూపుతున్న స్థానికులు

పామిడి : పట్టణంలోని 17వ వార్డులో సీసీ రోడ్లు వేయాలని స్థానికులు టిడిపి నాయకులను కోరారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ కుమారుడు ఈశ్వర్ ఆదేశాల మేరకు టిడిపి నాయకులు ఆదివారం వార్డులో పర్యటించి ప్రజలను సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కాలనీలో చాలాచోట్ల విద్యుత్ తీగలు కిందకి వేలాడుతున్నాయని, సీసీ రోడ్లు వేయాలని, డ్రెయినేజీ కాలువలు ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు టిడిపి నాయకులు స్పందిస్తూ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బొమ్మా మోహన్, వడ్డే శివ, మహమ్మద్ రఫీ, అప్పన్నగారి కుమార్, శ్రీరాములు, నల్లబోతుల శీన, రామకృష్ణ, వెంకటేష్, సద్దాం, మంజునాథ్, రాము, తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి విశేషస్పందన

రాయదుర్గం : చేంజ్ ఫర్ సొసైటీ రాయదుర్గంలోని జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 386 మంది ప్రజలకు కళ్లు, గుండె, మూత్రపిండాలు, థైరాయిడ్, మోకాళ్ల నొప్పులకు సంబంధించిన పరీక్షలు చేశారు. ఇందులో భాగంగా 72 మంది ప్రజలకు కంటి పరీక్షల నిమిత్తం నంద్యాల లోని శాంతిరాం వైద్య కళాశాల ఆసుపత్రికి పంపించనున్నట్లు నిర్వాహకులు జబీఉల్లా తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సొసైటీ సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి మంజునాథ్‌గౌడ్, టిడిపి పట్టణ అధ్యక్షుడు నాగరాజు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు అంబాజీరావు, ధనార్జన, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, ప్రజలు

నేరాలు ఘోరాలు

మద్యం పట్టివేత

గుత్తి : మండలంలోని ఊటకల్లు గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లను ఆదివారం పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన గురుమోహన్‌రెడ్డి తన ఇంట్లో 14 క్వార్టర్ మద్యం బాటిళ్లు అక్రమంగా నిల్వ ఉంచుకున్నట్లు తెలియడంతో దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. నిందితునిపై కేసు నమోదు చేశారు.

అంగన్వాడీ హెల్పర్ మృతి

శింగనమల : మండల కేంద్రంలోని అంగన్వాడీ సెంటర్-2లో హెల్పర్‌గా విధులు నిర్వహిస్తున్న హుస్సేన్‌బీ (50) ఆదివారం మృతి చెందింది. ఈమె కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈనేపథ్యంలో ఆదివారం మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.